

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**తుమ్ క్యా జానో, తుమ్హారి యాద్‌మే**
**హమ్ కిత్నా రోయే, హమ్ కిత్‌నా రోయే**
**రైన్ గుజారీ తారే గిన్ గిన్, చైన్ సె జబ్ తుమ్ సోయే**
**హమ్ కిత్‌నా రోయే...**

సినిమా పేరు 'షిన్ షినాకీ బూబ్ల బూ '. విచిత్రమైన పేరు. సినిమా కూడా ముంబాయి ఫాంటసీ స్టంట్ సినిమా. 'షిన్ షినాకీ' అనే అమ్మాయి 'బూబ్ల బూ' అనే యువకుడి సహాయంతో తన తండ్రి హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటుంది. ఇందులో పాటలకు పెద్ద ప్రాధాన్యం లేదు. కానీ ఈనాటికి కూడా 'తుమ్ క్యా జానో తుమ్హారి యాద్ మే హమ్ కిత్నా రోయే' పాట వల్ల ఈ సినిమా పేరు తెలుస్తున్నది. పి.ఎల్. సంతోషి అతి మృదువైన భావాలతో రచించిన ఈ పాటకు సంగీత దర్శకత్వం వహించింది సి.రామచంద్ర.

సి. రామచంద్ర, పి.ఎల్, సంతోషి ప్రాణ స్నేహితులు. హింది సినీ ప్రపంచంలో పాశ్చాత్య, భారతీయ సంగీతాలను కలగలిపి అద్భుతాలు సృష్టించటానికి ఆరంభవాక్యం పలికినవాడు సి.రామచంద్ర. అందుకే ఆ కాలంలో హాస్య సినిమాలు అధికశాతం సి.రామచంద్ర సంగీత దర్శకత్వంలోనే అయి ఉండేవి.

ముఖ్యంగా కామెడీ నటుడు భగవాన్‌కూ సి.రామచంద్రకూ చక్కని దోస్తీ ఉండటంతో భగవాన్ సినిమాలన్నిటికీ సి.రామచంద్రనే సంగీత దర్శకత్వం వహించేవాడు. అలాగే, 'షిన్ షినాకి బబ్లాబూ' అన్న పేరు చూసి ఎంతోమంది సంగీత దర్శకులు సినిమాకు సంగీత దర్శకత్వం వహించేందుకు వెనుకంజ వేశారు. కానీ సి.రామచంద్రకు అలాంటి పట్టింపులు ఏమీ లేవు. హాయిగా సంగీత దర్శకత్వ బాధ్యతలు స్వీకరించాడు. సినిమా టైటిల్ పాటను గమ్మత్తుగా రూపొందించాడు. 'షిన్ షినాకి ' అని సి.రామచంద్ర స్వయంగా అంటే లతా మంగేష్కర్ గమ్మత్తుగా 'బబ్లాబూ' అని 'బూ అని దీర్ఘం తీస్తుంది. అంత చిలిపి పాటను రూపొందించిన కళాకారులే, సందర్భాన్ని బట్టి 'తుమ్ క్యా జానో' లాంటి హృదయాన్ని వేదనతో నింపే పాట, అదీ మాములు వేదనకాదు, మధురమైన వేదన కలిగించి రోదనలో ఉన్న సంతృప్తి, ఆనందాలను

అనుభూతికి తెచ్చి సాంత్వననిచ్చే అత్యంత మృదువైన, మధురమైన పాటను రూపొందించారు. అత్యంత ఆశ్చర్యం కలిగించే విషయం ఇది. సృజనాత్మక కళాకారుల సృజనలోని వైవిధ్యం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది. కాస్త భయం కూడా కలిగిస్తుంది. ఎందుకంటే, మన ప్రమేయం లేకుండానే సృజనాత్మక కళాకారులు మనలో విభిన్నమైన భావాలు కలిగిస్తూ, అస్సలు అనుభవంలో లేని అనుభూతులను అనుభవింపచేస్తూ, మైనం ముద్దల్లా మన మనస్సులను మలచుకుంటూ, తోలు బొమ్మల్లా ఆడించటం అర్థమయి భయం వేస్తుంది. బహుశా కళాకారులకు సామాన్య మానవుడిపై ఉన్న ఈ పట్టువల్ల వెర్రి అభిమానం ఏర్పడుతుందేమో. అది వెర్రి తలలు వేయటం అనుభవిస్తున్నాం.

'తుమ్ క్యా జానో' బాణీ అద్భుతం, భావం మృదువయినది. కానీ లత పాడిన విధానం పాట భావం సూటిగా గుండెల్లో స్థిరపడి అలజడి కలిగించే రీతిలో ఉంటుంది. ఎక్కడా విషాదం బహిరంగంగా ప్రదర్శించుకున్నా, పదాలను పలకటం, రాగాలను తీయటం వంటి విషయాల్లో, లత స్వరం వేదనను పాటగా మలచినంత ప్రభావం కలిగించే రీతిలో పాడింది. లత పాటను పాడటంలో ధ్వనించే నిర్లిప్తత మనసును కలచివేస్తుంది. ముఖ్యంగా, పాటలో హై పిచ్‌కి వెళ్లేటప్పుడు లత స్వరం తీయని అసిధార అయి గుండెను చీలుస్తున్న భావన కలుగుతుంది. సంయుక్త సృజన అయిన సినీ పాటకు ఇంత శక్తి ఎలా వస్తుందన్న ఆలోచన వస్తుంది.

సినిమా నిర్మాత పి.ఎల్. సంతోషి ఆ కాలంలో, సినీ నటి, ఈ సినిమాలో నాయిక 'రెహాన ' ప్రేమలో తలమునకలుగా ఉండేవాడు. ఆమె కోసం సినిమాలు నిర్మించాడు. అతి సుందరమైన పాటలు రాశాడు. నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత, గేయ రచయితగా ఎన్ని విధాలుగా 'రెహానా' కెరీరును అభివృద్ధి చేయగలడో, అన్ని విధాలా ఆమె అభివృద్ధి కోసం పాటుపడ్డాడు. 'షిన్ షినాకి బబ్ల బూ' సినీ నిర్మాణం కూడా 'రెహానా' ప్రేమ ప్రదర్శనలో భాగమే.

అయితే, 'రెహానా', పి.ఎల్ సంతోషి ప్రేమను తనకు అనువుగా వాడుకుంది. అతడి ప్రేమను స్వీకరించలేదు. తిరస్కరించలేదు. అతడి సినిమాల్లో నటించేది కానీ అతడిని సన్నిహితంగా రానిచ్చేది కాదు. గంటల తరబడి, ఆమె మేకప్ గది బయట ఎదురు చూస్తూ కూర్చునేవాడు పి.ఎల్.సంతోషి. తలుపు తెరవమని అభ్యర్థించేవాడు. ఆమె కనికరించేది కాదు. గది బయట కూర్చుని తన హృదయవేదనను తెలిపేవాడు. ఆమె కరిగేది కాదు. ఆమె కోసం ఎదురు చూస్తూ కన్నీరు కార్చేవాడు. ఆమె పట్టించుకునేది కాదు.

**తుమ్ క్యాజానో, తుమ్హారి యాద్‌మే, హమ్ కిత్నా రోయే,**

ఇప్పుడు పాటలో పదాలు మరింత శక్తివంతంగా తోస్తాయి. తన హృదయ వేదన స్రవంతిలో శుభ్రం చేసి, బాధతో అలంకరించి, ప్రేమతో సృజించిన పదాలవి. నీకేం తెలుసు, నీకోసం నేను ఎంత రోదించానో '.. ఆమె తలుపు తెరవదు. అతని వైపు చూడదు. అతని ప్రేమను స్వీకరించదు. అతను మాత్రం ఆమెను మరచిపోలేదు. ఆమె కరుణాకటాక్ష వీక్షణం కోసం ఎదురు చూడకుండా ఉండలేదు.

**చాంద్ కొ క్యా మాలూమ్, చాహతా హై ఉసే కోయి చకోర్**

**వో బేచారా దూర్ సె దేఖే, కరేన కోయీ షోర్..**

'లాల్ బంగ్లా' సినిమాలో ముకేష్ పాడిన అతి గొప్ప పాట ఇది. ఇద్దరి నడుమ కలుగవలసిన ప్రేమ ఒకే వైపుంటే ఉండే బాధను, వేదనను ఎద కరిగి కన్నీరయ్యే రీతిలో ప్రతిబింబిస్తుందీ పాట. ముకేష్ విషాద స్వరం ఆ భావనను ఇనుమడింప చేస్తుంది. చకోర పక్షి, వెన్నెల సోనకోసం ఎదురు చూస్తూంటుంది. నోరు తెరచి జాబిల్లి వైపు చూస్తూనే ఉంటుంది.

**నీ కన్నులలోనా దాగెనులే వెన్నెల సోనా**

**చకోరమై నిను వరించి అనుసరించినానే**

**కలవరించి నానే..**

ఇలాంటి ఆరాధనన్నమాట. చకోరం తనకోసం ఎదురు చూస్తున్నదని జాబిల్లికి తెలియదు. చకోరానికి చంద్రుడికి తెలియ చెప్పే వీలు లేదు. ఎలాంటి శబ్దం చేయకుండా, నిశ్శబ్దంగా చంద్రుడిని చూస్తూ ఎదురు చూస్తూంటుంది చకోరం. ఇది పి.ఎల్.సంతోషి పరిస్థితిని చక్కగా వర్ణిస్తుంది.

**దూర్ సె దేఖే ఔర్ లల్‌చాయే**

**ప్యాస్ నజర్‌కీ బఢతీ జాయే**

**బదలీ క్యా జానే హై పాగల్, కిస్ క మన్‌కా మోర్.**

చకోరం చంద్రుడిని దూరం నుంచి చూస్తూంటుంది. చూస్తున్న కొద్దీ కళ్ల దాహం పెరుగుతూనే ఉంటుంది. 'ప్యాస్ నజర్ కీ' చక్కని భావం. పద ప్రయోగం. 'కళ్ల దాహం' అన్నది సరైన అర్థాన్నివ్వదు. హిందీ పదాలను మక్కీకి మక్కీ అనువదించటం కుదరదు. ఎంత చూసినా తనివి తీరదు. ఇంకా చూడాలనిపిస్తూంటుంది. అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఉంటుంది. కళ్లకు దాహం ఏమిటి? 'దాహం' అన్నది మంచినీటి కోసం స్వాభావికమైన కోరిక. శరీరానికి నీరు అవసరం. ఆ నీరు అవసరమైనప్పుడు 'దాహం' కలుగుతుంది.

'దాహం' సాధారణంగా 'నాలిక' ద్వారా తెలుస్తుంది. కానీ 'దాహం' అనే పదాన్ని తీవ్రమైన కోరికను సూచించేందుకు వాడతారు. 'తీరని దాహం' అన్నది కేవలం నీటికే అన్వయించకూడదు. మనిషికి పలురకాల దాహాలున్నాయి. అధికార దాహం, ప్రతీకార దాహం, ప్రేమ దాహం, ఇలా.. ఇక్కడ కంటికి ఆమెని చూడాలని ఉంది. చూస్తున్న కొద్దీ ఇంకా చూడాలన్న కోరిక పెరిగిపోతోంది. తీవ్రమౌతుంది. అందుకే దూరం నుంచి చూస్తున్న కొద్దీ కోరిక మరింత పెరుగుతోంది. ఆశ కలుగుతోంది. దానివల్ల ఇంకా చూడాలన్న 'దాహం' కలుగుతోంది. ఎలాగయితే నెమలి మనస్సులో ఉన్నది మేఘాలకు తెలియదో, ఆలాగే చకోరం మనస్సులో ఉన్నది చంద్రుడికి తెలియదు.

అలాగే ఆమె కోసం ఎంత ఎదురు చూశాడో ఆమెను తలచుకుంటూ ఎంతగా బాధపడ్డాడో ఆమెకు తెలియదు. అందుకే పి.ఎల్. సంతోషి 'తుమ్ క్యా జానో, తుమ్హారె యాద్‌మే హమ్ కిత్ నా రోయే' అన్నాడు. మామూలు పదాలు. సులభంగా అర్థమయ్యే భావం. కానీ పదాలకు వేదన అద్ది, బాధను పూసి, ప్రేమలోని ఔన్నత్యాన్ని, విరహంలోని అందమైన భావనను రాగంలో బంధించింది సి. రామచంద్ర. దానికి ప్రాణం పోసింది లత.

1950లో 'సజా' సినిమాలో 'తుమ్ న జానే కిస్ జహా మె ఖో గయే' అనే లత పాట సుపర్ హిట్ అయింది. ఎస్డీ బర్మన్ సంగీత దర్శకుడు. 'ఎస్డీ బర్మన్'ను అంత చక్కటి పాట రూపొందించినందుకు అభినందిస్తూ, దాన్ని మించే పాటను రూపొందిస్తానని ఛాలెంజ్ చేశాడు సి.రామచంద్ర. ఆ ఛాలెంజ్ ఫలితమే 'తుమ్ క్యా జానో ' పాట బాణీ.

'తుమ్ క్యా జానో ' పాట బాణీ వినటానికి ఎంతో సులువుగా అనిపిస్తుంది. కానీ పాడటం ఎంతో కష్టం. ముఖ్యంగా లతా మంగేష్కర్ పాటలో పదాలను పలికిన తీరు, మంద్ర స్వరంలో 'తుమ్ క్యా జానో' లో తుమ్' అని వదల లేక వదలలేక వదిలినట్టు అంటూ క్యా దగ్గర వత్తి దీర్ఘం తీసి 'జానో ' అని తేలికగా అనటం ఎంతో గొప్ప ఎఫెక్ట్ నిస్తుంది. అంటే, ఆమె అతడి జ్ఞాపకాలతో ఎంత బాధపడుతోందో, తానే చెప్పాల్సి వస్తోందన్న బాధ, అయిష్టం ప్రదర్శిస్తూ, తుమ్ కా జానో' లో లత కాస్త బాధ, కాస్త నిష్ఠూరం ధ్వనింపచేస్తూ, పాటను వినటం పలు భావాల తుఫానులో ప్రయాణంలా మలుస్తుంది లత. ముఖ్యంగా, 'తుమ్హారె యాద్‌మే', ‘తుమ్హారే’ అన్న పదాన్ని పలికిన తీరు, అలా పలుకుతూ, ఒక నిట్టూర్పులాంటి ఎఫెక్ట్ నివ్వటం అద్భుతం అనిపిస్తుంది. అతడిని తలవటమే బాధ, నిరాశలను కలిగిస్తున్నదన్న భావన కలిగిస్తుంది.

ఇక 'హమ్ కిత్నా రోయే' అని రెండవసారి అన్న విధానం బాధ తీవ్రతను, రోదనను మరింత సృష్టించేస్తుంది. ఈ పాట హేమంత్ కుమార్‌కి ఎంతగా నచ్చిందంటే, బెంగాలీలో 'అయాన్ రాండ్ ' నవల 'ఫౌంటన్ హెడ్' ఆధారంగా నిర్మించిన 'సూర్యతోరన్' అన్న సినిమాలో 'తుమి తొ జానోనా' అన్న పాటను 'తుమ్ క్యాజానో ' బాణీలో రూపొందించాడు. 'నేను ఈ పాట ప్రేమలో పడిపోయాను. ఇంత గొప్ప బాణీని నేను వినలేదు' అంటూ రామచంద్రను, లతను పొగిడాడు. ఈ పాట తయారవుతున్న సమయంలో సి.రామచంద్ర లతతో తలమునకలుగా ప్రేమలో ఉన్నాడు. తన సినిమాల్లో లత పాటలుండాల్సిందే అని పట్టుపట్టేవాడు. అలా అటు పి.ఎల్ సంతోషి విఫల ప్రేమను, సి.రామచంద్ర లతల సాన్నిహిత్యాన్ని కలిపి చూస్తే, ఈ పాట మామూలు గీతాలకన్నా మరింత మధురంగా అనిపిస్తుంది. ఒక్కసారి వింటే సరిపోదు, మళ్లీ, మళ్లీ వినాలనిపిస్తుంది. ఎన్నిమార్లు విన్నా ఇంకోసారి వినాలనిపిస్తుంది.

**కిత్‌నీ కలియాన్ ఖిలీ చమన్‌మే**
**ఖిల్ కే ఫిర్ ముర్ఝా గయా**
**ఆస్ దిలాకర్ భోలే మన్‌కో**
**బార్, బార్, సమ్ ఝా గయా**

రోకే జవానీ కాటీ జిసేనే

నైనా రోయే, రోయే

హమ్ కిత్ నా రోయే...

పాటలో ప్రదర్శించే భావాలు మనసులో లోపొరల్లోకి ఇంకుతూంటే ఎంత గొప్పగా రాశాడు అనిపిస్తుంది. ఆమె అతడిని గుర్తు చేసుకుంటూ ఎంతో బాధపడుతూ, రోదిస్తోంది. అతను ప్రశాంతంగా నిద్రిస్తూంటే, ఆమె నిద్రరాక తారలు లెక్కిస్తూ రాత్రంతా అతడిని తలచుకుంటూ బాధపడుతోంది. లత 'హమ్ కిత్ నా రోయే' అని ప్రతి సారీ భిన్నంగా అంటోంది. 'ఎన్నో పూలు వికసించాయి. వికసించి వాడిపోయాయి. మనసుకు ఆశను కలిగించాయి. ఆమె యవ్వనమంతా కన్నీటితో గడచిపోయింది. ఏడుస్తూ ఏడుస్తూ.. ఎంత ఏడ్చిందో అతడికేం తెలుసు? అతడు హాయిగా ప్రశాంతంగా ఉన్నాడు. చరణాలు లత ఎలా పాడుతుందంటే, ఒకోసారి గుస గుసగా పాడుతూ నిద్రలోకి జారుతున్న భావన కలిగిస్తుంది. అంతలో రోకే జవానీ అంటూ హై పిచ్ కి వెళ్తుంది. ఈ పాట బాణీ గురించి, లట పాడిన విధానం గురించి ఒక పుస్తకమే రాయవచ్చు.

'రెహానా' మూసిన తలుపుల బయట నుంచుని, ఎప్పుడు తలుపులు తెరుస్తుందోనని ఎదురుచూస్తున్న పి.ఎల్.సంతోషి హృదయం ఎంత దుఃఖిస్తే, ఇలాంటి భావాలు రూపుదిద్దుకుంటాయో ఊహించాలంటేనే బాధ కలుగుతుంది. 'రెహానా' అతడిని కరుణించలేదు. ఆమె కెరీరు ఎదగదని గ్రహించగానే అన్నీ వదిలి పాకిస్తాన్ వెళ్లిపోయింది.

'హమ్ కిత్ నా రోయే, తుమ్ క్యాజానో అన్నది నిజం అయింది.

ఈ పాట విడుదలై, అమరమైన విషాదగీతంగా గుర్తింపు పొందే సమయానికి సి.రామచంద్రతో కలసి పని చేయకూడదని లత నిశ్చయించుకుంది. లత ఆధారంగా తన సృజనను దిద్దుకున్న సి.రామచంద్ర లత రహితంగా పాటలను ఊహించలేకపోయాడు. అతని కెరీరు దిగజారి, ఆవిరైపోయింది. 'హమ్ కిత్ నా రోయే, తుమ్ క్యాజానో..

1952లో సెన్సార్ సర్టిఫికేషన్ అయి విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమా, కొత్తగా అమలులోకి వచ్చిన చట్టం ప్రకారం నిషేధానికి గురయింది. దాంతో సినిమా విడుదల కొన్నాళ్ల పాటు నిలిచిపోయింది. విడుదల అయ్యేసరికి సినిమాపై ఎవరికీ ఆసక్తి లేదు. దాంతో సినిమా పరాజయం పాలయ్యింది. ఈనాటికీ సినిమా, సినిమాతో పాటు ఆనాటి కళాకారుల అపరిమితమైన కళాప్రదర్శనకు నిదర్శనంగా ఈ పాట లత పాడిన అత్యద్భుతమైన పాటల్లో ఒకటిగా నిలచి, చిరంజీవిగా ఉంది. ఆనాటి కళాకారుల జ్ఞాపకాలను తాజాగా ఉంచుతోంది. ఆ మధురమైన మెలోడీల కాలం, విశిష్టమైన వ్యక్తిత్వాల కాలం, ఉన్నతమైన సృజన కాలాన్ని తలచుకుంటూ 'తుమ్ క్యాజానో, తుమ్హారి యాద్ మే హమ్ కితనా రోయే ' అంటూ ఉత్తమ గీతాల ప్రేమికులు మిగిలి ఉన్నారు.

వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలతో...

## (మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments